


ఓ చెరువులో ఓ మోస్తరు బురద నీళ్లున్నాయి. అందులో ఓ పదేళ్ల పిల్లాడు చేపల్ని పట్టేస్తున్నాడు. అధికారం చూపించాలనే భావం నరనరానా జీర్ణించుకొన్నందువల్ల "ఎవఁడ్రా నువ్వు?" అని పెద్దగా కేక వేశాను.

పిల్లాడు భయపడుతూ బుట్ట తీసుకొని నా దగ్గరకొచ్చాడు. బుట్టలో చిన్న చేపలు ఐదారు న్నాయి.

"ఎవఁడ్రా నువ్వు?" అని వాడు వణికిపోయే కొద్దీ అధికారంతో అరవసాగాను.

"మేం ఊరి చివరనున్న పాకల్లో ఉండే మాదిగోళ్లమండీ" అంటూ చెప్పాడు.

కులం పేరు చెప్పగానే సానుభూతితో కొద్దిగా కరిగాను. "ఇలా పరాయి వాళ్ల చెరువులో దొంగతనంగా చేపలు పట్టడం తప్పు కదరా?" అని అడిగాను.

"లేదయ్యగారు చేపలన్నీ నిన్ననే పట్టేశారు" అన్నాడు వాడు.

"మరయితే ఇప్పుడు నువ్వెందుకు పడుతున్నావురా" అని అన్నాను. ఇంకా నాలో చావని రాక్షస అధికారి వుండటం వల్ల "ఏరా మాట్లాడవ్" అని పెద్ద గదమాయించాను.

"నిన్నటి నుండి బువ్వ లేదయ్యా. ఆకలేసి నీరసంతో పడిపోయేనయ్యా. వీటిని తిందామని పట్టుకున్నానయ్యా" అన్నాడు జాలి ముఖంతో వాడు.

నాలోని రాక్షసుడు మరింత చచ్చాడు వాడి మాటలకు. అభ్యుదయవాది కాస్తంతగా తొంగిచూశాడు ఆ క్షణంలో... "మీ నాన్నేం చేస్తున్నాడు?" అన్నాను.

"మా అయ్య లేడండీ... నా చిన్నప్పుడే చచ్చిపోయిండు" చెప్పాడు పిల్లాడు.

"ఎలా పోయాడు?" అడిగాను ఆశ్చర్యంగా.

"పెదకాపుగారు బాగా కొట్టారండీ" అని కళ్లలో నీళ్లు తిరుగుతూండగా చెప్పాడు.

మనిషి, మనిషిని మామూలుగా కొడితే చావడు. చచ్చేంతగా చాలా ఘోరంగా కొట్టి ఉంటారు. ఈ చావు గురించి పదేళ్ల క్రితం ఊళ్లో కొందరు చెప్పుకుంటుంటే విన్నాను. ఒక హరిజనుడు పెదకాపు పొలంలో బాగా ఆకలేసి ధాన్యాన్ని తీసుకుకెళ్తుంటే, నలుపుకుపోతున్నోడిని పట్టుకుని పెద్దకాపు పాలేరు చెట్టుకు కట్టేశాడు. ఆకలితో అలమటించి దొంగతనం చేసిన ఆ హరిజనుడిని ఎలా పెదకాపు హింసించిందీ ఊళ్లో రకరకాలుగా చెప్పుకున్నారు. వాణ్ని చెట్టుకు కట్టేసి చింత రువ్వలతో బాదించారు. కాళ్ల మీద రోకలి పెట్టి అటు ఇద్దరూ, ఇటు ఇద్దరూ నిలబడి తొక్కారు. ఒంటి నిండా బెల్లం రాసి రాత్రంతా చెట్టుకి కట్టి చీమలకు ఆహారంగా ఆ దళితుల్ని బలి చేశారు. పొద్దుట ఒంటి నిండా వాతలు పెట్టి, సగం మీసం, సగం గుండు గొరిగించి, మళ్లీ మరోసారి ఇలా చేస్తే ప్రాణాలు తీసేస్తామని బెదిరించి వదిలారట. ఏ పోలీసూ, ఏ ప్రభుత్వమూ, ఈ పెదకాపుని ఏమీ చేయలేదు.

తర్వాత ఓ పది రోజులకి ఆ దళితుడు పైలోకాల కెళ్లాడు. పెదకాపుకి ఏ శిక్షా పడలేదు.

పిల్లాడి వైపు చూశాను. ముఖంలో అమాయకత్వం నాకు కనిపించింది. వాడు నల్లగా ఉన్నాడు. చీకటిని మనిషి విపరీతంగా ద్వేషిస్తాడు. అందుకే నల్లగావున్న వాళ్లని మనిషి ఏదో రూపంలో ద్వేషిస్తూనే వున్నారు ఈ ప్రపంచం మొత్తం మీద! విధి కూడా నుదుట మట్టిరాత రాసి, మట్టి బతుకు బతకమంటోంది.

"ఏరా చదువుకుంటున్నావా?" అన్నాను.

"లేదయ్యగారు" అన్నాడు.

"ఏం?"

"చదువుకుంటే అమ్మ, నేను బ్రతికేదెట్టా మాడొక్కెలా నిండిద్దయా?" అని జాలిచూపులతో ప్రశ్నించాడు వాడు.

నాకు కొంత మనసు కలుక్కుమంది. చాలా జాలేసింది. ఇంత చిన్నపిల్లాడు ఎంత జీవనసూత్రాన్ని ఎలా భావించాడోనని.

పిల్లాడికి పది రూపాయలు ఇచ్చాను. "ఈ పదితో ఏం చేస్తావురా?" అని అడిగాడు.

వాడు ఎంతో ఆనందపడుతూ, "అయ్యా! అమ్మా! నేను అన్నం తిని చానా రోజులయినాయి. బియ్యం కొనుక్కొని కాసింత బువ్వ తింటామయ్య" అన్నాడు వాడు.

నాకు కళ్లలో నీళ్లు తిరిగాయి ఆ క్షణాన. మరి రేపటి రోజు వాడి పరిస్థితేమిటి? మళ్లా పస్తు! చదువు లేక ఇలా దొంగతనాలు చేస్తూ, ఏ దొంగగానో, రౌడీగానో మారుతాడు. ఈ పరిస్థితులే వాడినలా చేస్తాయి. దీనికి ఏదో ఒక పరిష్కారం నేనే వెతకాలి. ఏదో ఒక పని చేసి వీడికి మంచి జీవితం ఇవ్వాలి. అని సంకల్పించుకొన్నాను ఆ క్షణంలో.

000

పిల్లాడిని మా ఇంటికి తీసుకెళ్లి, మా ఇద్దరు పిల్లలతో పాటు చదివించాను. వీడి అమ్మను ఆ రోజే పట్నం తీసుకెళ్లి ఓ అనాథాశ్రమంలో వంటమనిషిగా పనికి పెట్టించాను. ఆమె జీవితానికి ఇక ఏ దిగులూ లేదు. పిల్లాడు మా ఇంట్లో ఒకడిలా కలిసిపోయాడు. అభ్యుదయభావాలతో ఉన్న నేను, అవే భావాలున్నందుకే ప్రేమించి పెళ్లి చేసుకున్న నా భార్య, నేను చేసిన ఈ పనికి ఎంతో అభినందించింది. పిల్లాడిని మూడవ కొడుకుగా చూస్తూ, అమ్మ ఆప్యాయతనూ, ప్రేమానురాగాలమ

రంగరించి ఓ పెద్ద కంపెనీలో ఇంజినీరుగా తీర్చిదిద్దింది. వీడి కంటే చిన్నోళ్లయిన నా ఇద్దరు పిల్లలు కూడా చిన్నప్పటి నుండి తన సొంత అన్నయ్యలాగే భావించాలనే, అనాథాశ్రమంలో పనిచేస్తూ ఉన్న సొంత తల్లి దగ్గరికి వీడిని ఒక్క సారంటే ఒక్కసారి కూడా తీసుకెళ్లలేదు. లేనిపోని భేదాభిప్రాయాలు రాకూడదనే ఆ పని నేను చేసినా, ఓ పక్క ఏదో తప్పు చేశానన్న బాధ నాకు.

ఎన్నోసార్లు "మా అమ్మను చూపించవా?" అని వాడు ప్రాథేయపడినా చూపించలేదు. ఓ తల్లినీ, బిడ్డనూ వేరు చేశానన్న బాధ నన్ను వెంటాడుతూనే ఉంది. ప్రాయశ్చిత్తం చేసుకొనేందుకు వాడికి, వాళ్లమ్మను ఇక చూపించాలని ఓ నిర్ణయానికి వచ్చాను.

000

వాడు టై కట్టుకొని, సూటు తొడుక్కొని, దర్జాగా దొర బాబులా కారు లోంచి దిగుతుంటే నాకే ఎంతో ముచ్చటేసింది. వీడేనా, వీడి చిన్నప్పుడు చేపలు పడుతూ నాకు దొరికిపోయిన దళిత పిల్లాడు? అని ఆశ్చర్యమేసింది. వీడి అమ్మ వీడిని చూసి ఎంతో ఆనందిస్తుంది. వీడింత ప్రయోజకుడైనందుకు, ఇలా ఉన్నత ఉద్యోగం చేస్తున్నందుకు మురిసిపోతుంది అని మనసులోనే ఆనందపడ్డాను.

వాడు టై కట్టుకొని, సూటు తొడుక్కొని, దర్జాగా దొర బాబులా కారు లోంచి దిగుతుంటే నాకే ఎంతో ముచ్చటేసింది. వీడేనా, వీడి చిన్నప్పుడు చేపలు పడుతూ నాకు దొరికిపోయిన దళిత పిల్లాడు? అని ఆశ్చర్యమేసింది. వీడి అమ్మ వీడిని చూసి ఎంతో ఆనందిస్తుంది. వీడింత ప్రయోజకుడైనందుకు, ఇలా ఉన్నత ఉద్యోగం చేస్తున్నందుకు మురిసిపోతుంది అని మనసులోనే ఆనందపడ్డాను.

000

నేరుగా వీడిని అనాథాశ్రమానికి తీసుకెళ్లాను. తన కన్నతల్లిని చూడబోతున్నానన్న ఆనందంతో, ఎంతో ఉద్వేగంతో వున్నాడు వాడు. వాడిని ఆఫీసు రూం దగ్గర కూర్చోబెట్టి లోనికి పిలుచుకు వద్దామని వెళ్లాను.

ఇంకేముంది, విషాదకరమైన వార్త నా చెవిన పడింది. ఒక్కసారిగా నిశ్చేష్టుడనై కూలబడిపోయాను. వాడి తల్లి ఓ వారం క్రితం వరకు ఇక్కడే పనిచేసుకుంటూ, తన కన్న కొడుకుపై ప్రేమను తన కడుపులోనే పెంచుకుంది. ఇక్కడ అనాథలనే తన కన్నబిడ్డలుగా, ప్రేమగా చూసుకుంది జబ్బున పడి కన్నకొడుకును ఎలాగైనా చూడాలని తపించింది. కుమిలి కుమిలి కన్నకొడుకు చూపుకై తపించింది. దిగులు పెట్టుకొని చనిపోయిందని అక్కడ పనిచేసేవారు దీనంగా చెప్పారు. అది విన్న నాకు కళ్ల వెంట ధారలుగా కన్నీళ్లు...! చివరి చూపు భాగ్యం కూడా వీడికి దక్కనందుకు ఎంతో మథనపడ్డా ఆ క్షణంలో. వీడి చదువు భవిష్యత్తు అనే కోణంలోనే ఓ కఠోర పాషాణ హృదయంతో చూస్తూ... తల్లీబిడ్డలను ప్రేమకు దూరం చేశాను. పశ్చాత్తాపంతో ఆవేదన పడ్డాను. వాడికి జరిగినదంతా పూసగుచ్చినట్లు చెప్పాను. వాడు కూడా ఓ గంట దాకా తీవ్ర మనోవేదనకు గురై కుళ్లికుళ్లి ఏడుస్తూ తన కన్నతల్లిని గుర్తుకు తెచ్చుకున్నాడు. అన్నిటికీ కారణమైన నన్ను వీడు ద్వేషిస్తాడని భావించా ఆక్షణంలో.

కానీ మరుఁరోజు నన్నూ, నా భార్యను ఆప్యాయంగా హత్తుకొని, "మీరే నాకు దేవుడిచ్చిన అమ్మానాన్నలు! చేపలు పట్టే వాడుగానో, ఏ దొంగగానో మారే నన్ను ఇంతటి వాడిని చేశారు. జన్మజన్మలకీ మీకు కృతజ్ఞుణ్ని" అంటూ చెమ్మగిల్లిన కళ్లతో చెప్పాడు వాడు.

వాడి ఆప్యాయతకు మా కంట ఆనందబాష్పాల రూపంలో కన్నీళ్లొచ్చాయి.

## దసరా ... సరదా!!

చిన్నన్న

